నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శుక్రవారం | జనవరి 26, 2024 | www.navatelangana.com

లబోదిబోమంటున్న రాజీవ్ స్వగృహ ప్లాట్ల కొనుగోలుదారులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో సంవత్సరం క్రితం జరిగిన రాజీవ్ స్వగృహ వేలం పాటలో ప్లాట్లను సొంతం చేసుకున్న లబ్ధిదారులకు సొంతింటి కల కలగానే మిగిలిపోతోంది. జిల్లా కేంద్రంలో హోర్డింగులు పెట్టి వేలం పాటలో ప్లాట్లు సొంతం చేసుకున్న వారికి 6 నెలలలోపు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని అధికారులు ప్రకటించారని, కానీ సంవత్సరం గడుస్తున్నప్పటికీ ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదని లబ్ధిదారులు వాపోతున్నారు. విద్యుత్ సౌకర్యం లేక ఇల్లు ఏ విధంగా నిర్మించుకోవాలో తెలియక 360 మంది ప్లాట్ల కొనుగోలుదారులు లబోదిబోమంటున్నారు. ఈ విషయమై ఎన్నిసార్లు జిల్లా కలెక్టర్‌ను కలిసినప్పటికీ సమస్య పరిష్కారం కాక వారి ఆవేదన అరణ్య రోదనగానే మిగిలిపోతోంది. ఇప్పటికైనా కలెక్టర్ కాంట్రాక్టర్‌తో సమావేశం ఏర్పాటు చేసి విద్యుత్ సౌకర్యం కల్పించి కొనుగోలుదారులకు సొంతింటి కలను నిజం చేయాలని కోరుతున్నారు. ప్లాట్లు కొన్న వారిలో ఉద్యోగులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. వీరందరూ లోన్ సౌకర్యంతో గృహ నిర్మాణానికి సిద్ధంగా ఉన్నారు. విద్యుత్ సౌకర్యం కల్పించిన వెంటనే పనులు మొదలు పెడతామని వారు అభిప్రాయపడుతున్నారు.

తెలంగాణలో మూడు పార్లమెంట్ స్థానాలు మాలలకే ఇవ్వాలి

జైపూర్ : వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో మూడు పార్లమెంట్ స్థానాలు మాలలకే ఇవ్వాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షులు డాక్టర్ పసుల రాంమూర్తి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇందారం గ్రామానికి చెందిన బేద మల్లేష్‌ను రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ప్రకటిస్తూ నియామకపత్రం అందజేశారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమాన్ని నిర్మించాలన్నారు. రాష్ట్రంలో మాలల కోసం సుదీర్ఘమైన ఉద్యమాన్ని చేసి వారి హక్కుల సాధన కోసం పోరాడాలని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికలు వస్తున్నందున మనువాద బీజేపీ ఎస్సీ వర్గీకరణపై కమిటీ వేయడం మత రాజకీయాలు చేయడం వెనుక కుట్ర దాగివుందని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు బానిసలుగా మారే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమితులైన మల్లేష్ జగిత్యాల జిల్లా కేంద్రంలో నియామక పత్రం అందుకున్నానని తెలిపారు. జాతీయ, రాష్ట్ర స్థాయి మాలమహానాడు ఆఫ్ ఇండియా నాయకులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. మాలమహానాడు నిర్ణయాలకు కట్టుబడి రాష్ట్ర స్థాయిలో పని చేయడంతో పాటు పటిష్టతకు పాటుపడుతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు జూపాక సుధీర్, జాతీయ ఉపాధ్యక్షులు ముత్యాల పుల్లయ్య, ప్రధాన కార్యదర్శి దసండ్ల ప్రభాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సొగాల కిష్టయ్య, జూపాక పద్మ, మేరుగు లక్ష్మన్, మేకల లక్ష్మన్, సుద్దాల వెంకటయ్య, దీపక్ పాల్గొన్నారు.

కొత్త ప్రభుత్వం..తొలి వేడుక..!

- నేటి గణతంత్ర పండగకు సర్వం సిద్ధం
- ముస్తాబైన పోలీసు పరేడ్ మైదానాలు
- జాతీయ జెండా ఆవిష్కరించనున్న జిల్లా కలెక్టర్లు
- ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి

రాష్ట్రంలో కొత్త సర్కారు కొలువు దీరింది. బీఆర్ఎస్ స్థానంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటుచేసింది. కొత్త ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణతంత్ర వేడుకలు కావడంతో ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. ఈ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన నేపథ్యంలో ఆయా జిల్లాల ఉన్నతాధికారులు ఇప్పటికే వేడుకల నిర్వహణపై ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. వేడుకల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే ఆయా జిల్లా కేంద్రాల్లో పోలీసు పరేడ్ మైదానాలను వేడుకల నిర్వహణకు ముస్తాబు చేశారు. 75వ గణతంత్ర దినోత్సవ వేళ శుక్రవారం ఉదయం 9గంటలకు ఆయా జిల్లాల కలెక్టర్లు జాతీయ జెండాలను ఆవిష్కరించనున్నారు. పరేడ్ మైదానాలతో పాటు ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సంసిద్ధులయ్యారు.


ఆదిలాబాద్‌లో ఎస్పీ గౌస్ ఆలంతో కలిసి ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి సుమారు నెలన్నర రోజులు కావస్తోంది. ఇది వరకు పదేండ్ల పాటు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ స్థానంలో తాజాగా కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని చేజిక్కించుకుంది. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే వచ్చిన తొలి గణతంత్ర వేడుక కావడంతో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని యోచిస్తోంది. ఇందులో భాగంగా ఆయా జిల్లాల ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఇటు అధికార యంత్రాంగం సైతం ఈ వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు సిద్ధమయ్యాయి. ఇందుకు ఆయా ప్రాంతాల్లోని పోలీసు పరేడ్ మైదానాలు సిద్ధం చేశారు. ఈ వేడుకల సందర్భంగా ఆయా పాఠశాలల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ఆయా శాఖల్లో విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన అధికారులు, ఉద్యోగులకు ప్రశంస పత్రాలను అందించనున్నారు. వివిధ శాఖల ద్వారా అమలవుతున్న పథకాలకు సంబంధించి అవగాహన కోసం స్టాళ్లను ఏర్పాటుచేస్తున్నారు. వీటితో పాటు వేడుకలకు వచ్చిన వారికి తాగునీరు, టెంట్ సౌకర్యం తదితర వాటిని ఏర్పాటుచేస్తున్నారు.

జెండా ఆవిష్కరించనున్న కలెక్టర్లు..!

గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆయా జిల్లా కేంద్రాల్లో నిర్వహించే వేడుకల్లో కలెక్టర్లు జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. ఆదిలాబాద్‌లోని పోలీసు పరేడ్ మైదానంలో నిర్వహించే వేడుకల్లో జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ జెండా ఎగురవేయనుండగా నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించే వేడుకల్లో కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. కుమురంభీం జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ మైదానంలో నిర్వహించే వేడుకలో జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసే వేడుకల్లో కలెక్టర్ బదావత్ సంతోష్ జాతీయ జెండాను ఎగురవేయనున్నారు. అన్ని జిల్లా కేంద్రాల్లోనూ అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేశారు. అనంతరం సాయంత్రం సమయంలోనూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రాలతో పాటు మండల కేంద్రాలు, గ్రామాల్లో ఈ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు.




వేడుకలకు ముస్తాబైన పరేడ్ మైదానం

ప్రతి పౌరుడు జంతు సంక్షేమానికి సహకరించాలి



నవతెలంగాణ-నస్పూర్

జంతు సంక్షేమాన్ని ప్రతి పౌరుడు బాధ్యతగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాబర్‌లో జిల్లా పశు వైద్య, సంవర్ధశాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ రమేష్‌తో కలిసి జంతు హింస నివారణ సంఘం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అడవులు, సరస్సులు, నదులు, వన్యప్రాణులతో సహజ పర్యావరణాన్ని రక్షించడం, మెరుగుపర్చడం, జీవుల పట్ల కరుణ కలిగి ఉండటం ప్రతి పౌరుడి విధి అని, వీధి కుక్కల పట్ల సానుభూతితో వ్యవహరించాలని అన్నారు. కుక్క కరిచిన వెంటనే గాయాన్ని శుభ్రంగా కడగాలని, ఆసుపత్రికి వెళ్లి వైద్యులను సంప్రదించి వారి సూచన మేరకు క్రమం తప్పకుండా రేబిస్ వ్యాధి టీకాలను వేసుకోవాలని తెలిపారు. జంతువుల సంరక్షణ కోసం ప్రభుత్వం జాతీయ జంతు కళ్యాణ మండలిని స్థాపించడం జరిగిందని, ప్రతి రాష్ట్రం జంతు సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేసి జంతు సంక్షేమ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సభ్యులుగా జిల్లా జంతు హింస నివారణ సంఘాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జంతు హింసకు పాల్పడినా, వాటి ఆవాసాలను ధ్వంసం చేసినా, వాటి సంరక్షణకు సేవ చేస్తున్న వారిని అడ్డుకొని ఇబ్బందిపెట్టినా శిక్షార్హులని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

'ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు విలువైనది'



నవతెలంగాణ-దండేపల్లి

ఓటు ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగం ప్రజలకు అందించిన గొప్ప ఆయుధమని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సంధ్యారాణి అన్నారు. శుక్రవారం జాతీయ ఓటరు నమోదు దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి ఓటు ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు కొత్త ఓటర్ల నమోదు కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఓటు హక్కు నమోదుకు, ఓటు హక్కు వినియోగానికి విస్తృత ప్రచారం నిర్వహించి, ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. 2024 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువత ఓటరుగా నమోదు కావాలని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో తప్పక ఓటు హక్కుని వినియోగించుకోవాలని కోరారు. దేశ భవిష్యత్తులో యువత పాత్ర కీలకమన్నారు. డబ్బు మద్యానికి ప్రలోభ పడకుండా స్వచ్ఛందంగా ఓటు వేసి మంచి నాయకులను ఎన్నుకోవాలని కోరారు. ఇప్పటి వరకు ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఓటర్లందరూ జాబితాల్లో తమ పేరును ఓసారి తనిఖీ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మల్లేశం, డిప్యూటీ తహసీల్దార్ విజయ, ఆర్ఐలు భూమన్న, చంద్రమౌళి, సీనియర్ అసిస్టెంట్ లావణ్య, రెవెన్యూ సిబ్బంది, ఎంపిటిసి ముత్యాల శ్రీనివాస్, ఐకేపి సిబ్బంది, పలువురు బిఎల్వోలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పాయల శంకర్ ప్రోటోకాల్ పాటించాలి



నవతెలంగాణ- ఆదిలాబాద్‌అర్బన్

షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో పట్టణ, గ్రామ ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాలని, మహిళా ప్రజాప్రతినిధులను సైతం గౌరవించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు కలెక్టర్ రాహుల్ రాజ్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రోటోకాల్ వివాదంతో కొనసాగుతున్న పలు అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీపై స్థానిక ఎమ్మెల్యే పాయల శంకర్ రాజకీయ రగడకు దారితీస్తున్నారని, స్థానికంగా ఉన్న కౌన్సిలర్లు, జడ్పిటిసి, ఎంపీటీసీలకు సమాచారం ఇవ్వకుండా నియంతృత్వ వైఖరి కొనసాగించడం సరైన విధానం కాదని విమర్శించారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ప్రజల ఓట్లతో ఎన్నికైన కౌన్సిలర్లు, జెడ్పిటిసిలకు సమాచారం ఇవ్వకుండా చెక్కులు పంపిణీ చేశారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీలో లబ్ధిదారులైన మహిళలను నేలపై కూర్చోపెట్టి ఎమ్మెల్యే ఇతర ప్రజాప్రతినిధులు కుర్చీలో కూర్చున్నారని ఆరోపించారు. ఇది సరైన విధానం కాదని మండిపడ్డారు. ఎమ్మెల్యే నియంతృత్వ పోకడలకు పోకుండా ప్రోటోకాల్ పాటించాలని పేర్కొన్నారు. లబ్ధిదారులపై చిన్న చూపు చూపకుండా ప్రతి మహిళా లబ్ధిదారుకు భవిష్యత్తులో తగినన్ని కుర్చీలు వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బండారి సతీష్, అజయ్ పాల్గొన్నారు.

రెడ్డిపాక సాహిత్‌కు బంగారు పతకం

నవతెలంగాణ - కాసిపేట

మండల కేంద్రానికి చెందిన రెడ్డిపాక సాహిత్ బంగారం పతకం సాధించాడు. ఈ నెల 21,22 తేదీల్లో పంజాబ్ రాష్ట్రంలోని చండీఘడ్‌లో నిర్వహించిన ఆసియా సవాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణ రాష్ట్రం నుంచి కిక్ బాక్సింగ్ అసాట్ విభాగంలో పాల్గొని ప్రతిభ కనభరిచి బంగారు పతకాన్ని సాధించినట్లు కోచ్ రంగు శ్రీనివాస్ తెలిపారు. బంగారు పతకాన్ని సాధించిన సాహిత్‌ను పలువురు అభినందించారు.

రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ఎంతో విలువైంది

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్
- నిర్మల్‌లో ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్



ప్రతిజ్ఞ చేస్తున్న మంచిర్యాల కలెక్టర్, అదనపు కలెక్టర్



ఓటరుకు ఎపిక్ కార్డు అందజేస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-నస్పూర్

దేశ పౌరులకు భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ఎంతో విలువైనదని, 18 సంవత్సరాలు వయస్సు కలిగిన ప్రతి ఒక్కరూ తమ వివరాలు నమోదు చేసుకొని ఓటు హక్కు పొంది ఎన్నికల సమయంలో కచ్చితంగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన 14వ జాతీయ ఓటరు దినోత్సవ వేడుకలలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి.రాహుల్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి.శేషాద్రితో కలిసి పాల్గొన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా వీడియో ద్వారా భారత ఎన్నికల సంఘం కమిషనర్ రాజీవ్ కుమార్ సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల రాష్ట్రంలో జరిగిన శాసనసభ నియోజకవర్గ ఎన్నికలలో ఎక్కడా కూడా రీపోలింగ్‌కు అవకాశం లేకుండా ఎన్నికలు జరిగాయని, ఇది ఎన్నికల సంఘం నిబద్ధతతో కూడిన విజయమని అన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువ ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఓటు హక్కు పొందిన ప్రతి ఒక్కరు తమ ఓటు వినియోగించుకునే విధంగా అవగాహన కల్పించాలని తెలిపారు. యువ ఓటర్లు తమ స్నేహితులు, బంధువులు, కుటుంబ సభ్యులు కచ్చితంగా ఓటు వేసేలా ప్రోత్సహించాలని తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అర్హత గల వారు స్వచ్ఛందంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, నిర్భయంగా, ఎలాంటి ప్రలోభాలకులోను కాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. అనంతరం 14వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని 'ఓటు లాంటిది ఇంకొకటి లేదు - నేను కచ్చితంగా ఓటు వేస్తాను' అనే నినాదంతో అధికారులు, విద్యార్థులు, సిబ్బందితో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. నూతనంగా ఓటు నమోదు చేసుకున్న వారికి ఎపిక్ కార్డులు పంపిణీ చేయడంతో పాటు ఓటరు దినోత్సవంపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీలలో గెలుపొందిన వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కళాశాల, పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

నిర్మల్ : సమీకృత కలెక్టరేట్ సముదాయంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన 14వ జాతీయ ఓటరు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాలల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఓటు నమోదు, వినియోగంపై చిన్నారులు నాటిక రూపంలో ప్రదర్శనలు ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటు నమోదుపై జిల్లా వ్యాప్తంగా ఎన్నో రకాల అవగాహన కార్యక్రమాల్ని నిర్వహించడం జరిగిందని, ఓటరు నమోదుకు వివిధ స్థాయిల్లో పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని చెప్పారు. ప్రతి ఒక్కరూ విధిగా ఓటును పొందిన వారు కచ్చితంగా ఓటును వినియోగించుకోవాలని, ఎలాంటి ప్రలోభాలకు లోనవ్వకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని తెలియజేశారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్స్‌ను, దివ్యాంగులను, నూతనంగా ఓటును నమోదు చేసుకున్న యువతను, ట్రాన్స్‌జెండర్స్‌ను శాలువాతో సన్మానించారు. జాతీయ ఓటరు దినోత్సవ సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి ఉపన్యాస, వ్యాసరచన పోటీల్లో విజేతలకు ప్రశంసా పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, కిషోర్‌కుమార్, ఆర్డీఓ జిల్లాస్థాయి అధికారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


నిర్మల్‌లో ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్, జిల్లా అధికారులు

హైదరాబాద్‌కు తరలిన కాంగ్రెస్ నాయకులు

మందమర్రి : హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో గురువారం జరిగిన తెలంగాణ కాంగ్రెస్ బూత్ లీడర్ కన్వెన్షన్‌కు చెన్నూరు నియోజకవర్గ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి నాయకత్వంలో మందమర్రి మండలంలోని వివిధ గ్రామాల నాయకులు హాజయ్యారు. దీనికి ముఖ్య అతిథిగా ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. పార్టీ కష్ట కాలంలో పనిచేసిన నాయకులను, కార్యకర్తలను కడుపులో పెట్టుకొని కాపాడుకుంటామని అధిష్టానం భరోసా ఇచ్చిందని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మందమర్రి మండల ఇన్‌చార్జి కడారి జీవన్ కుమార్, నాయకులు మాసు సంతోష్, వేల్పుల శంకర్, నరసింహ తిరుపతి, మామిడిగట్టు శ్రీనివాస్ పాల్గొన్నారు.

జైపూర్ : కాంగ్రెస్ రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి జైపూర్, భీమారం మండలాల నుండి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో తెలంగాణ కాంగ్రెస్ బూత్ లీడర్స్ కన్వెన్షన్‌లో ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున్ ఖర్గే ముఖ్య అధితిగా పాల్గొన్నారు. పార్టీ పటిష్టత కోసం బూత్ లెవల్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారని జైపూర్ మండల అధ్యక్షులు మహమ్మద్ ఫయాజోద్దీన్, భీమారం అధ్యక్షులు వి.శ్రీనివాస్ తెలిపారు.


మందమర్రి


జైపూర్

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
శుక్రవారం | జనవరి 26, 2024 | www.navatelangana.com

కుర్చీలు, కార్పెట్ల అందజేత

నవతెలంగాణ-తలమడుగు



మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు గురువారం అల్లూరి మధుకర్ రెడ్డి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ రూ10వేల విలువగల 20 కుర్చీలు, పాఠశాల చైర్మెన్ నేతుల గంగన్న రూ.5వేలతో కార్పెట్లను ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వెంకటరావు ఉపాధ్యాయులు వినోద్‌రెడ్డి మురళీధర్ పలువురు ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు ఈ సందర్భంగా కుర్చీలు కార్పెట్లు అందించిన, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

నవతెలంగాణ-ఖానాపూర్



డ్రైవర్లు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను సక్రమంగా పాటించాలని ఎస్సై లింబాద్రి అన్నారు. గురువారం ఖానాపూర్ పట్టణంలోని అంజద్ ఖాన్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పలువురు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఆటోపై జీవనం సాగించే ప్రతి డ్రైవరు డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, ఆర్సీ సంబంధిత పత్రాలు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రత అంశాల దృష్టిలో పెట్టుకొని ఆటోలను నడుపుతూ ప్రజలకు ఇబ్బంది కలవకుండా చూడాలని అన్నారు.

అడ్డగుట్టను సందర్శించిన రాష్ట్ర మహిళ కమిషన్ సభ్యురాలు



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

అడ్డగుట్ట గ్రామాన్ని రాష్ట్ర మహిళ కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి సందర్శించారు. గురువారం పీఎం జన్‌మన్‌లో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన సికిల్ సెల్ కార్యక్రమం పనితీరును పర్యవేక్షించారు. ఆస్పత్రిలో ఏయే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కొలాం, తోటి కులస్తులకు అందిస్తున్న వైద్యాన్ని గురించి డాక్టర్ సర్పరాజ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అంకొలి పీహెచ్‌సీ సిబ్బంది. రామాయి సబ్ సెంటర్ హెల్త్ అసిస్టెంట్స్ లలిత, మమత, ఆశాలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బూత్ కమిటీల సమావేశానికి తరలిన కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-లక్ష్మణచాంద

అఖిల భారత కాంగ్రెస్ గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన బూత్ కమిటీల సమావేశానికి మండల నాయకులు, బూత్ కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. రానున్న రోజుల్లో బూత్ స్థాయిలో పార్టీని పటిష్టపర్చడమే ధ్యేయంగా పని చేస్తామని నాయకులు వొద్నలా రాజేశ్వర్ తెలిపారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధిక స్థానాలు గెలుపొందడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు ఈటెల శ్రీనివాస్, అట్ల రవీందర్‌రెడ్డి, సాకాలి రాజేందర్, నగేష్, సమ్మెట రవి, ప్రభాకర్, పోతారెడ్డి ఆయా గ్రామాల బూత్ కమిటీ సభ్యులు తరలి వెళ్లారు.

ప్రజలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-నార్నూర్

ప్రజలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ రాంబాబు అన్నారు. గురువారం మండలంలోని చోర్‌గావ్ గ్రామపంచాయతీ పరిధిలోని కొలాంగూడలో ప్రధానమంత్రి జన్‌మన్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలో రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, టీబీ స్క్రీనింగ్, సికిల్‌సెల్ రక్త పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో హెల్త్ సూపర్‌వైజర్ చౌహన్ చరణ్‌దాస్, వైద్య సిబ్బంది హిమబిందు, ప్రియాంక, ఉమేశ్వరి, గంగాలక్ష్మి, ఈశ్వరి, లక్ష్మి, గోకుల్, కార్యదర్శి లఖన్, ఆశాలు సంగీత గ్రామ పటేల్ కుమ్ర మారు ఉన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



నవతెలంగాణ-తలమడుగు

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత ఉంటుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గురువారం మండలంలోని పల్సి తండాలో సంత్ శ్రీ సద్గురు నారాయణ్ బాబా 28వ అఖండ హరినామ మహా యజ్ఞోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సొనమాత ఆశీర్వాదాలు తీసుకున్న అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. నారాయణ్ బాబాతో తనకు ఉన్న సంబంధాలను పరిచయాలను భక్తులకు తెలియజేశారు. నారాయణ బాబా మన మధ్య లేకున్నప్పటికీ ఎంతో మందికి మంచి మార్గాన్ని చూపించారని అన్నారు. నేటి జీవన విధానంలో యువతీ, యువకులు మంచి లక్ష్యాన్ని ఎంచుకొని, చెడు మార్గాన్ని త్యజించాలని అన్నారు. చెడు వ్యసనాలకు బానిస కాకుండా మంచి లక్ష్యం కోసం కష్టపడాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజారెడ్డి, భీంపూర్ జెడ్పీటీసీ సుధాకర్, గ్రామసర్పంచ్ అంగూర్, మండల కన్వీనర్ తోట వెంకటేష్, నారాయణ బాబా సంస్థ అధ్యక్షులు జాదవ్ కిషన్, బోథ్ నియోజకవర్గం అధికార ప్రతినిధి కిరణ్ కుమార్, సర్పంచ్‌లు రాంబాయి, పోతారెడ్డి, దేవరావు, ఇచ్చోడ మండల అధ్యక్షులు ప్రీతమ్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యతోనే ఆదివాసుల జీవితాల్లో వెలుగులు

- జిల్లా ఎస్పీ గౌస్ఆలం
- యువతకు పోలీసుల శాఖ ద్వారా శిక్షణ అందిస్తాం



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

విద్యతోనే ఆదివాసుల జీవితాల్లో వెలుగులని జిల్లా ఎస్పీ గౌస్ఆలం అన్నారు. గురువారం పోలీసులు మీకోసంలో భాగంగా పాఠగూడ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనకు గుస్సాడి నృత్యాలు, డోలు వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. ముందుగా సంస్కృతి, సాంప్రదాయ బద్ధంగా మహిళలు ఎస్పీ పాదాలు కడిగి సాదరంగా ఆహ్వానించారు. ఆడపడుచులు తెల్లటి వస్త్రంతో అడ్డు పెట్టుకొగా ఎస్పీ వారి ఆచారం ప్రకారం కట్నం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రామ పటేల్ కొడప లక్ష్మణ్, కారోబారి రాజేశం లు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ చేతులచే రూ.1లక్ష విలువ గల 300 కుటుంబాలకు చలి నుంచి రక్షించేందుకు దుప్పట్లను పంపిణీ చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఆదివాసీ తెగల్లో అత్యంత వెనుకబడిన పీవీటీజీలు వారి తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి పంపించాలని సూచించారు. చదువుతోనే మీ పిల్లలకు ఉజ్వల భవిషత్తు ఉంటుందన్నారు. ప్రభుత్వం మీకు కల్పిస్తున్న రిజర్వేషన్ ఉపయోగించుకోవాలని హితవు పలికారు. మీ పిల్లలు బాహ్య ప్రపంచంతో పోటీ పడాలంటే ఐఏఎస్, ఐపీఎస్ వంటి చదువులపై పట్టు సాధించాలని అన్నారు. ఆదిమ తెగల కోసమే కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి జన్ మన్ వంటి మంచి పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఇటీవల ప్రభుత్వం 18 వేల పోలీసు శాఖల్లో రిక్రూట్‌మెంట్ నిర్వహించిందని గుర్తు చేశారు. పోలీసుశాఖ ఆధ్వర్యంలో వారికి ఉచితంగా శిక్షణతో పాటు మెటీరియల్‌ను అందించడం జరిగిందన్నారు. తాను ఇంతకు ముందు ఆదివాసీ ప్రాంతమైన ములుగు జిల్లాలోనే విధులు నిర్వర్తించానని అన్నారు. వారి సమస్యలు తనకు తెలుసునని పేర్కొన్నారు. ఈ జిల్లా స్థితి గతులపై గతంలో ఇక్కడ పనిచేసిన మహేష్ భగవత్, తరుణ్ జోషి తదితర ఉన్నతాధి కారులతో తెలుసుకున్నానన్నారు.గతంలో నక్సల్స్ ప్రభావం ఉన్న ఈ ప్రాంతం ప్రస్తుతం ప్రశాంత వాతావరణంలో ప్రజలు గడుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులతో మమేకమై ఏయే తరగతుల్లో చదువుతున్నారని అడిగి తెలుసుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు చదువులో ఇంగ్లీషుపై పట్టు సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్‌గౌడ్, సీఐ రామకృష్ణ, ఎస్సై దుబ్బాక సునీల్, ఎంపీటీసీ భీమ్‌రావ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

నవతెలంగాణ-తాంసి



భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన ఎడపెల్లి రమేష్ అనే కౌలు రైతు గత కొన్ని రోజుల కింద పురుగులమందు తాగి తన ఇంట్లోనే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని రైతు ఆత్మహత్యల నివారణ కమిటి, రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగెపు బోర్రన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం గ్రామసర్పంచ్ కళ్యాణి గంగయ్యతో కలిసి రైతు ఆత్మహత్య చేసుకున్న కుటుంబాన్ని కలిసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతు 12 ఎకరాలను కౌలుకి తీసుకొని పత్తి, కంది పంటలు సాగుచేస్తున్న సందర్భంలో వ్యవసాయానికి చేసిన అప్పులు, పంట దిగుబడులు పెట్టుబడికి గల కారణాలను తెలుసుకోవడం జరిగిందని అన్నారు. గత రెండు, మూడు సంవత్సరాల నుంచి అతివృష్టి, అనావృష్టి ఉండటంతో ఆశించినంత పంట దిగుబడి రాక పోవడంతో మానసికంగా కుంగిపోయి పంటకు పెట్టిన పెట్టుబడులు రాలేవని, తీసుకొచ్చిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనోవేదనకు గురై తాను నివసిస్తున్న ఇంటిలోనే ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 194 జీఓ ప్రకారంగా రూ.6 లక్షల పరిహారం ఇచ్చి ఆదుకోవాలని అన్నారు. కుటుంబ యజమానురాలికి నెలకు రూ.5వేల పెన్షన్ ఇవ్వాలని అన్నారు. వీరి పిల్లలకు ఉన్నతమైన ఉపాధి విద్య, వైద్య సదుపాయాలు ఇతర అవకాశాలు అందించాలని కోరారు. వ్యవసాయ రంగంలో అతి తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయాన్ని ఇచ్చే విధంగా చిరు దాన్యలను పండించే విధంగా కృషి చేయాలనీ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అయన వెంట రైతులు గంగన్న, ఓంప్రసాద్, నందయ్యా, ఉన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

నవతెలంగాణ-బేల

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ జెడ్పీటీసీ నాక్లే రాందాస్, సామ రూపేష్‌రెడ్డి అన్నారు. గురువారం కుమురంభీం, కుమురం సూరు యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడాపోటీల ముగింపు కార్యక్రమానికి వారు ముఖ్యఅధితులుగా హాజరై, గెలుపొందిన జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. గురువారం జరిగిన చివరి ఫైనల్ క్రీడా పోటీల్లో గాదిగూడ మండలం చిత్తగూడకు చెందిన కబడ్డీ జట్టు మొదటి బహుమతి గెలుచుకోగా, మహారాష్ట్రలోని సోనీపోడ్ గ్రామానికి చెందిన కబడ్డీ క్రీడాకారులు రెండో బహుమతి సాధించారు. మూడో స్థానంలో సదల్‌పూర్ నిల్వగా, కడ్కి గ్రామ కబడ్డీ జట్టు నాలుగో స్థానంలో నిలిచి బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి క్రీడల వల్ల గ్రామీణ ప్రాంతాల్లోని, క్రీడాకారు బయటకు వస్తారని అన్నారు. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని అపుడే మానసికోల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం పెంపొందుతుందని అన్నారు. కబడ్డీ జట్లకు మొదటి బహుమతిగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి రూ.21వేలు, రెండో బహుమతి రాథోడ్ అరుణ మాధవ్ ఉపసర్పంచ్, సదల్‌పూర్ మినీ గురుకులం టీచర్స్ స్టాఫ్, సదల్‌పూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి నార దత్తు రూ.15వేలు, మూడో బహుమతి ఎంపీటీసీ కొడప అరుణ్, కోరంగే జంగుశావ్, చాంద్‌పల్లి సర్పంచ్ రూ.10వేలు నాలుగో బహుమతి సామ రూపేష్‌రెడ్డి రూ.5వేలు చొప్పున అందజేశారు. ఈ కార్యక్రమంలో సదల్‌పూర్ గ్రామసర్పంచ్ రాందాస్, కిసాన్ సెల్ బేల మండల అధ్యక్షుడు ఘన్‌శ్యామ్, సర్పంచులు ఆడే శంకర్, కేశవ్, తుకారాం, విపిన్, బోక్రే శంకర్, సూర్యబాన్, రమేష్ పటేల్, గ్రామస్తులు ఉన్నారు.

రైతులకు మద్దతు ధర కల్పించేందుకే ప్రభుత్వ కొనుగోళ్లు

నవతెలంగాణ-కుభీర్



రైతులకు మద్దతు ధర కల్పించేందుకే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో కందుల కొనుగోళ్లను ప్రారంభించారు. క్వింటాల్ కందులకు రూ.9వేల 530 మద్దతు ధర కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు విద్య, వైద్యం అందించేలా చూడాలని అధికారులకు సూచించారు. గ్రామంలో ఉన్న ప్రతి ఒక్క కుటుంబానికి అన్ని విధాలుగా దగ్గర ఉండి వారికి సేవ చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. ముందుగా యంత్రాలకు పూజలు చేసి, రైతుకు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహకార సంఘం చైర్మెన్ గంగాచరణ్ బోయిడి విఠల్, వి.మోహన్, నగేష్, ఆయా గ్రామాల రైతులు, మండల నాయకులు వ్యాపారవేత్తలు, వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి గంగన్న, క్రాంతి కుమార్ ఉన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం వైద్యులను నియమించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్రప్రభుత్వం పేదలకు నాణ్యమైన వైద్యం అందించాడానికి కావాల్సిన భవనాలు, పరికారాలను అందిస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం కూడా దానికి అనుగుణంగా వైద్యులను నియమించాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ కోరారు. గురువారం రిమ్స్‌లో కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.23 కోట్ల 75 లక్షలతో నిర్మించనున్న క్రిటికల్ కేర్ యూనిట్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గుత్తేదారునితో మాట్లాడి నాణ్యత లోపించకుండా పనులను త్వరగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వైద్య పరంగా అన్ని రకాల సాకారం అందిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్యులతో పాటు సిబ్బందిని నియమించి నాణ్యమైన వైద్యం పేదలకు అందేలా చూడాలని కోరారు. ఈ విషయమై సీఎం రేవంత్‌రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఇన్‌చార్జీ మంత్రుల దృష్టికి తీసుకెళ్లానని వారు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. పార్టీలు ఏవైనా ప్రజల శ్రేయస్సు కోసమే పని చేయాలన్నారు. ఆ దిశగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి సహకారం అందిస్తుందని, సీఎం రేవంత్ కూడా జిల్లా అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, బీజేపీ నాయకులు లాలామున్న, జోగు రవి, ముకుంద్, మహేందర్, వైద్యులు తిప్పెస్వామి, సిబ్బంది ఉన్నారు.

మండల స్థాయి షటిల్, బ్యాట్మెంటన్ పోటీలు

నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి ఖానాపూర్ మండల స్థాయి షటిల్, బ్యాట్మెంటన్ పోటీలు ప్రారంభించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. మండలస్థాయి పోటీల్లో ఖానాపూర్‌తో పాటు కడెం, దస్తురాబాద్, పెంబి, మండలాల క్రీడాకారులకు ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. ఖానాపూర్ పట్టణంలోని హైటెక్ సిటీ ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఈ పోటీల్లో ఉత్సాహవంతులైన క్రీడాకారులు పాల్గొనాలని నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతిగా రూ.2వేల నగదు, రెండో బహుమతిగా రూ.వెయ్యి నగదు, మూడో బహుమతిగా మెమొంటోలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు రూ.200 ఎంట్రీ ఫీజులు చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. పాల్గొనే క్రీడాకారులు 9866815278 నెంబర్ సంప్రదించి పోటీల్లో పాల్గొనాలని కోరారు.

ఖాందేవుని పూజలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి



నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని ఖాందేవున్ని గురువారం ఎమ్మెల్యే కోవ లక్ష్మీ దర్శించుకున్నారు. తొడసం వంశస్తులతో కలిసి సంప్రదాయ పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంస్కృతి సాంప్రదాయాలను కాపాడి భావితరాలకు అందించాలని సూచించారు. ఆలయాల అభివృద్ధితో పాటు ఆయా సౌకర్యాల కోసం రూ.5లక్షల మంజూరుకు కృషి చేస్తానని అన్నారు. పూజ కార్యక్రమంలో ఎంపీపీ కనక మోతుబాయి, తొడసం రూపదేవ్ పటేల్, తొడసం ఆనంద్ రావ్, తొడసం తెలంగ్‌రావ్, ఆలయ కమిటీ సభ్యులు తొడసం నాగోరావ్, తొడసం గోపాల్ ఉన్నారు.

పురుగులమందు తాగి యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

గుర్తుతెలియని పురుగులమందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం మండలంలోని వాన్వాట్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై ముజాహిద్ తెలిపిన వివరాల ప్రకారం.. వాన్వాట్ గ్రామానికి చెందిన తలాండే సీతారాం(22) బుధవారం సాయంత్రం తన పొలంలో గుర్తుతెలియని పురుగులమందు తాగాడు. కొన్ని సంవత్సరాల కింద తల్లిదండ్రులు ఇద్దరు చనిపోయారు. అనాధగా మిగిలిన తలాండే సీతారాం ఒక్కడే ఉండటంతో మానసికంగా కుంగిపోతూ జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్టు తెలిపారు. సీతారాం అక్క వత్సల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

కూలీలకు ప్రమాద బీమా సౌకర్యం

నవతెలంగాణ-తలమడుగు

కూలీలకు ప్రమాద బీమా సౌకర్యాన్ని జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి కల్పించారు. గురువారం రుయ్యాడి గ్రామానికి చెందిన వడ్డెర, బుడగ జంగం కులాలకు చెందిన పలువురు కూలీలకు తపాలాశాఖ కార్యాలయం ద్వారా వంద మంది కూలీలకు తన సొంత డబ్బులతో బీమా సౌకర్యం కల్పించారు. 5 సంవత్సరాలు తనే బాధ్యత తీసుకొని రెన్యూవల్ ప్రీమియాన్ని చెల్లిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కళ్యాణం లక్ష్మీ రాజేశ్వర్, సర్పంచులు పోతారెడ్డి, రఘునాథ్, తపాలా శాఖ జిల్లా అధికారులు జాదవ్ విజయకుమార్, పురుషోత్తం, ఎంపీటీసీ రమేష్‌రెడ్డి, ఎన్.అశోక్, ఎల్.ప్రవీణ్‌రెడ్డి, బాలాజీ, వెంకట్ రెడ్డి, సాంబశివ్ పాల్గొన్నారు.

ఉత్తర్వులు అందుకున్న పంచాయతీ కార్యదర్శులు

నవతెలంగాణ-ఉట్నూర్

పంచాయతీ కార్యదర్శులు క్రమబద్దీకరణ ఉత్తర్వులను గురువారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ పంద్ర జైవంత్‌రావుని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛంతో సన్మానించారు. ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు పంచాయతీ కార్యదర్శులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి మహేష్ కుమార్, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దహిగూడలో సికిల్ సెల్ పరీక్షలు



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

అంకోలి పీహెచ్‌సీ పరిధిలోని దహిగూడలో గురువారం డాక్టర్ సర్పరాజ్ ఆధ్వర్యంలో సికిల్ సెల్ పరీక్షలు నిర్వహించారు. గ్రామంలోని కొలాం గిరిజనులకు సికిల్‌సెల్ ఆరోగ్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామములో గల ప్రజలకు ఆయుష్మాన్ భారత్ కార్డులను అందజేయడం జరుగుతుందని అన్నారు. అనంతరం డాక్టర్ సర్పరాజ్ వైద్య సేవలు అందించారు. మంచి మనసుతో మానవసేవే మాధవసేవా అని గిరిజనులకు పండ్లు, కూరగాయలు, అందజేసి ఉదారతను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ముయ్యాల మోతి, రోహిదాస్, ఆశ జయ, గ్రామప్రజలు పాల్గొన్నారు.

గవర్నర్ చేతుల మీదుగా కలెక్టర్‌కు పురస్కారం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



14వ జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకొని హైదరాబాద్‌లో నిర్వహించిన వేడుకల్లో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ ఉత్తమ పురస్కారాన్ని అందుకున్నారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన శాసనసభ నియోజకవర్గ ఎన్నికలలో భాగంగా ఆసిఫాబాద్ జిల్లాలో ఎన్నికల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో సమర్థవంతంగా నిర్వహించడం, 14వ జాతీయ ఓటరు దినోత్సవంపై జిల్లా వ్యాప్తంగా ప్రజలకు అవగాహన కల్పించేలా విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించినందుకు గాను పురస్కారం పొందారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉత్తమ పురస్కారం రావడం సంతోషంగా ఉందని, ఇది మరింత బాధ్యత పెంచిందన్నారు.

మాస్టర్ ప్లాన్ అమలు చేయాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో మాస్టర్ ప్లాన్ అమలు చేయాలని సీపీఐ(ఎం) పార్టీ నాయకులు ముంజం ఆనంద్, చాప్లె సాయిలు కోరారు. గురువారం మున్సిపల్ కమిషనర్ అంజయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్ అమలు చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వర్షాకాలం నీరంతా కాల్వల్లో నిండి రోడ్లు, ఇళ్లలోకి చేరుతున్నాయన్నారు. దీంతో దుర్గంధంగా తయారవుతున్నాయన్న పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే మాస్టర్ ప్లాన్ అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు.



తునికాకు టెండర్లు వేయాలి

- టీఏజీఎస్ జిల్లా అధ్యక్షురాలు కోరింగ మాలశ్రీ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో తునికాకు టెండర్లు వేసేలా చూడాలని తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం(టీఏజీఎస్) జిల్లా అధ్యక్షురాలు కోరంగ మాలశ్రీ డిమాండ్ చేశారు. గురువారం సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కోవలక్ష్మిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయం తర్వాత తునికాకు సేకరణ రెండవ పంటగా ఉందన్నారు. ఆకు సేకరణ ద్వారా 30 వేల మంది లబ్ధిపొందుతారని, దీనిపై ఆధారపడి బీడీ పరిశ్రమ కూడా ఉందన్నారు. జిల్లాలోని అటవీశాఖ అధికారులు పెద్ద పులులు సంచరిస్తున్నాయనే పేరుతో ఈ సంవత్సరం ఆకు సేకరణ నిలిపివేయాల్సిందిగా సిఫారసు చేస్తూ ప్రభుత్వానికి నివేదికలు పంపించారన్నారు. జిల్లాలో రెండు ఫారెస్ట్ డివిజన్లు ఉన్నాయని, వీటి పరిధిలో మొత్తం 25 యూనిట్లు ఉండగా ఆసిఫాబాద్ డివిజన్‌లో మైనింగ్, కవ్వాల్ టైగర్ కారిడార్ పేరుతో గతంలోనే ఆకు సేకరణ నిలిపివేశారన్నారు. 12 యూనిట్ల గాను కేవలం 2 యూనిట్లకు గత సంవత్సరం టెండర్లు వేశారన్నారు. కాగజ్‌నగర్ డివిజన్‌లో కడంబ టైగర్ కారిడార్ పేరుతో గత సంవత్సరం 13 యూనిట్లకుగాను 9 యూనిట్లకు టెండర్లు పిలిచారన్నారు. ఈ సంవత్సరం పూర్తిగానే ఆకు సేకరణ నిలిపివేయాలని అటవీశాఖ అధికారులు ఆలోచన చేయడం పేదల పొట్ట కొట్టడమేనని ఆరోపించారు. పేదలకు ఉపాధి దొరికే విధంగా ఉన్న తునికాకు సేకరణ యథావిధిగా కొనసాగేందుకు జిల్లాలో టెండర్లు పిలిచే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని, గత సంవత్సరం చాలా కల్లాలలో 10 నుండి 20 మందికి కూలీ డబ్బులు కూడా రానటువంటి పరిస్థితి వాటిని కూడా ఇప్పించాలని, పెండింగ్‌లో ఉన్న బోనస్ కూడా చెల్లించే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఏజీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కోట శ్రీనివాస్, తునికాకు కళ్ళేదారుల సంఘం అధ్యక్షులు చన్నపురి కాశినాథ్, నాయకులు సోయం తిరుపతి, టేకం హన్మంతు, అజీజ్, బోరేం తిరుపతి, పేందం రవి, రౌతు లక్ష్మణ్, కొడప సంతోష్, ఆత్రం మంగయ్య, పెందం నగేష్ పాల్గొన్నారు.

మాలీ సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు సన్మానం

నవతెలంగాణ-కెరమెరి

మండలానికి ఇటీవల బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ షరీఫ్‌ను గురువారం మాలీ సంఘం మండల కమిటీ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మాలీ సంఘం మండల అధ్యక్షుడు కావుడే తులసిరాం, నాయకులు సెండే నారాయణ్, కోట్రంగే తిరుపతి, హన్మంతు, పోచయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని విద్యార్థులకు కులం, ఆధాయం లాంటి ధ్రువీకరణ పత్రాల జారీపై తహసీల్దారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి ఆరోపించారు. ధ్రువీకరణ పత్రాలు త్వరగా జారీ చేసేల చూడాలని కోరుతూ గురువారం కలెక్టరేట్ ఏఓ రఫత్ హుస్సేన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఇంటర్, డిగ్రీ విద్యార్థుల స్కాలర్‌షిప్స్, ఫీజు రియంబర్స్‌మెంట్స్‌లకు సంబంధించి ఆన్‌లైన్ చేయడానికి కులం, ఆదాయం ధ్రువీకరణ పత్రాలు అవసరమన్నారు. విద్యార్థులు వీటి కోసం 3,4 నెలలుగా తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న జారీ కావడం లేదన్నారు. సకాలంలో సర్టిఫికెట్స్ అందించడంలో మండల తహసీల్దార్‌లు నిర్లక్ష్యన్ని ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. విద్యారులకు సంబంధించి స్కాలర్‌షిప్స్ దరఖాస్తు చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల చివరి వరకు గడువు ప్రకటించిందని, విద్యార్థులకు కులం, ఆదాయం ధ్రువీకరణ పత్రాలు వస్తేనే దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. వెంటనే తహసీల్దార్లు సర్టిఫికెట్లు అందించేల చూడాలని, లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రవికాంత్, నిశాంత్, తేజ, అరుణ్ పాల్గొన్నారు.

29న ప్రయివేట్ ఉద్యోగాల జాబ్‌మేళా

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగాల కోసం ఈనెల 29న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కృషి విజ్ఞాన్ సొసైటీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఫీల్డ్ ఆఫీసర్, హెచ్‌ఆర్, ఆఫీస్ బాయ్ లాంటి నాలుగు రకాల పోస్టులు ఖాళీ ఉన్నాయని, వీటికి గాను 66 మంది అవసరముందని తెలిపారు. ఈ నెల 29న ఉదయం 11 గంటలకు జిల్లా కేంద్రంలోని పీఎంకేకే కార్యాలయంలో హాజరు కావాలని తెలిపారు. ఇతర వివరాల కోసం ఉపాధి కల్పన శాఖ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

బాధ్యతగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

నవతెలంగాణ-సిర్పూర్(టి)

భారత రాజ్యాంగం వయోజనులందరికి దేశానికి దిశానిర్దేశం నిర్ణయించే హక్కును కల్పించిందని, దీనిని ఓటు అనే ఆయుధంతో పాలకులను నిర్ణయించే అధికారం ఓటు హక్కు కలిగిన వారికి ఇచ్చిన గొప్ప అవకాశమని, ఓటును వినియోగించుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. గురువారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అధికారులు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేశ్వర్, ఎస్సై దీకొండ రమేష్, ఎంపీఓ మహేందర్‌రెడ్డి, రెవెన్యూ, మండల పరిషత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం

- ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారి
- ఘనంగా జాతీయ ఓటర్ దినోత్సవం





నవతెలంగాణ ఆసిఫాబాద్

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని, ఓటు హక్కు విలువను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. గురువారం 14వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకోని సమీకృత కలెక్టరేట్ భవనం నుంచి ర్యాలీ నిర్వహించారు. పిల్లల పార్కు, కుమురం భీం చౌరస్తా మీదుగా తిరిగి ర్యాలీ కలెక్టరేట్‌కు చేరుకుంది. అనంతరం కలెక్టరేట్ భవన ఆవరణలో జిల్లా అధికారులు, విద్యార్థిని విద్యార్థులు, కలెక్టరేట్ సిబ్బంది, ప్రజలతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం పౌరులకు కల్పించిన ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, ఎన్నికలలో అర్హత గల ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కు వినియోగించుకోవడంతో సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకొని దేశ అభివృద్ధికి దోహదపడాలన్నారు. జిల్లాలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. అతిపెద్ద ప్రజాస్వామ్యం కలిగిన భారత దేశంలో పాలకులను ప్రజలు ఎన్నుకుంటారని తెలిపారు. గత నెలలో స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత వాతావరణంలో అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించుకున్నారని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో రాబోవు పార్లమెంట్ ఎన్నికలను నిర్వహించేల అధికారులు సన్నద్ధం కావాలన్నారు. ఈ సందర్భంగా వయోవృద్ధులు, దివ్యాంగ ఓటర్లతో పాటు నూతనంగా ఓటు నమోదు చేసుకున్న వారిని సన్మానించి గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు, ఆర్డిఓ కదం సురేష్, జిల్లా అధికారులు రమాదేవి, ఒమర్ హుస్సేన్, ఉదయ్‌బాబు, ఉద్యోగులు, యువతీ యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రభుత్వ కళాశాలలో జాతీయ ఓటర్ దినోత్సవం

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవా విభాగం ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేయించి, ఓటు హక్కు ప్రాధాన్యతను ప్రిన్సిపాల్ రాందాస్ వివరించారు. అర్హత గల ప్రతి విద్యార్థి ఓటర్‌గా నమోదు చేసుకోవాలని, ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బెజ్జూరు : మండలకేంద్రంలో ఓటరు దినోత్సవాన్ని తహసీల్దార్ భూమేశ్వర్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఓటు ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదుచేసుకొని ఓటు హక్కు వినియోగించుకోవాలని ఈ సందర్భంగా తహసీల్దార్ కోరారు. ఓటరు నమోదు కోసం బీఎల్‌ఓలను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ బీమ్లానాయక్, ఆర్ఐ అచ్యుంత్‌రావు, రెవెన్యూ సిబ్బంది ప్రసాద్, ప్రకాష్, దేవాజీ, ఉపాధ్యాయులు రవికుమార్ పాల్గొన్నారు.

చింతలమానేపల్లి : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. మండల కేంద్రంలో తహసీల్దార్ నాగరాజ్ గౌడ్, ఎంపీడీఓ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఓటు హక్కు అవగాహన కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థులతో పాఠశాల నుండి ఛత్రపతి శివాజీ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఓటరు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్సై సురేష్ కుమార్, పోలీస్ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ డుబ్బుల నానయ్య, కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ నాజీమ్ హుస్సేన్, జూనియర్ అసిస్టెంట్ జాఫర్, ఉపాధ్యాయులు దేవాజి, ఆత్మహారం, గ్రామ కార్యదర్శి ఆసిఫ్ అలీ, అంగన్‌వాడీలు, ఆయా శాఖ అధికారులు పాల్గొన్నారు.

కెరమెరి : గురువారం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామ పంచాయతీలలో 14వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులతో చేపట్టిన ర్యాలీని తహసీల్దార్ షరీఫ్ ప్రారంభించారు. బస్టాండ్ ఆవరణలో మానవహారం చేపట్టారు. అనంతరం విద్యార్థులు, సీనియర్ సిటీజన్స్‌లను శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మహేందర్, ఎస్సై విజయ్ కుమార్, సర్పంచ్ రాథోడ్ బయనబాయి ఉత్తం నాయక్, ఎఫ్ఆర్వో మజారోద్దీన్, ఎంపీటీసీ ఇఫ్తేకార్ అహ్మద్, ఇనూస్, పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : ఓటు హక్కు ప్రతి ఒక్కరి బాధ్యతని, ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. గురువారం మండలకేంద్రంలో 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ప్రజా ప్రతినిధులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.





వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- తహసీల్దార్ ఆర్.శ్రీనివాస్



పోస్టర్లు విడుదల చేస్తున్న అటవీ శాఖ, పోలీస్ సిబ్బంది

నవతెలంగాణ-సిర్పూర్(టి)

అటవీ వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, వాటికి ఎలాంటి ఆటంకాలు కలుగకుండా చేస్తే వాటికి మనం చేసిన మేలని, అటవీ సంపదపైనే కొన్ని జాతుల వారు, వన్యప్రాణులు నివసిస్తున్నాయని, దీనిని గుర్తించి అటవీ సంపద కాపాడాలని తహసీల్దార్ ఆర్.శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలకేంద్రంలో అటవీ శాఖ కార్యాలయం ఆవరణలో అటవీ, వన్యప్రాణుల సంరక్షణ అనే అంశంపై అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. గత సంవత్సరంలో అటవీ, వన్యప్రాణుల వల్ల చనిపోయిన పశువులకు, వన్యప్రాణుల దాడికి గురైన వారికి నష్టపరిహారం అందజేశారు. దీనిలో 23 మంది పశువుల యజమానులకు, దాడిలో గాయపడిన ఇద్దరికి నష్టపరిహారం క్రింద రూ.5.40 లక్షల చెక్కులను ఎఫ్ఆర్ఓ పూర్ణచందర్, ఎస్సై దీకొండ రమేష్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అటవీ, వన్యప్రాణులను కాపాడాలని, ఎలాంటి ఉచ్చులు కానీ, విద్యుత్ తీగలు అమర్చరాదని, పెద్దపులి, చిరుత పులుల దాడిలో పశువులు చనిపోతే వెంటనే అటవీ శాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. వన్యప్రాణుల దాడిలో చనిపోయిన పశువుల కళేబరాలపై విష ప్రయోగం చేయరాదని, పోడు భూమిని, ఇదివరకే చేస్తున్న భూమిని విస్తరించవద్దన్నారు. అటవీ, వన్యప్రాణుల రక్షణలో అటవీ శాఖ సిబ్బంది, పోలీస్ సిబ్బందికి సహకరించాలని, గతంలో కాగజ్‌నగర్ మండలంలో రెండు పులులు మృతిచెందిన విషయం తెలిసిందే. రైతులు తమ పంట చేన్లలో విద్యుత్ వైర్లు పెట్టరాదని, దీనివల్ల మీతో పాటు మీ చుట్టుప్రక్కల ప్రాంతాల్లో ఉన్న రైతులకు కూడా ఇబ్బందిగా ఉంటుందని తెలిపారు. పశువుల కాపర్లు ఇద్దరు, ముగ్గురు తమ పశువులను తోడుకువెళ్లాలని, తమ పశువులను కాపాడుకోవాలనే ఉద్దేశ్యంతో వన్యప్రాణులను వేటాడుతున్నారని, ఇలాంటి సంఘటనే కాగజ్‌నగర్ మండలంలో జరిగిందని గుర్తు చేశారు. ఎలాంటి సమాచారం ఉన్న అటవీ శాఖ సిబ్బంది తెలియజేస్తూ అటవీ శాఖ సిబ్బందితో సహకరిస్తూ వన్యప్రాణులను, అటవీ సందపను కాపాడాలన్నారు. అనంతరం ఎస్సై దీకొండ రమేష్, ఎఫ్ఆర్ఓ పూర్ణచందర్ మాట్లాడుతూ రాత్రి సమయాల్లో అటవీలో తిరిగే జంతువులను కనిపెట్టడానికి గస్తీలు చేస్తామని, రైతులు, వన్యప్రాణులను వేటాడే వేటగాళ్ల విద్యుత్ వైరుయలు బిగించడం వల్ల పోలీస్, అటవీ శాఖ సిబ్బంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడితే అటవీ శాఖ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేశ్వర్, విద్యుత్ శాఖ ఏఈ ఇర్ఫాన్, ఎంపీఓ మహేందర్‌రెడ్డి, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసులకు పోలీస్ శాఖ అండగా ఉంటుంది

- ఎస్పీ కె.సురేష్ కుమార్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆదివాసులకు పోలీస్ శాఖ అండగా ఉంటుందని ఎస్పీ సురేష్ కుమార్ అన్నారు. మండలంలోని కర్జి గ్రామ పంచాయతీ పరిధిలోని లోహ గ్రామాన్ని సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా బియ్యం, నిత్యావసర సరుకులు, మహిళలకు చీరలు, దుప్పట్లు, యువతకు వాలీబాల్ కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అసాంఘిక శక్తులకు సహకరించవద్దన్నారు. యువత, ప్రజలు అప్రమత్తంగా ఉంటూ, అపరిచిత వ్యక్తుల సమాచారం పోలీసులకు అందించాలన్నారు. గిరిజనుల అభివృద్ధి, సంక్షేమమే పోలీసుల ప్రధాన లక్ష్యమన్నారు. యువత ప్రజలు మావోయిస్టుల ప్రలోభాలకు లోనుకావద్దని, సహకరించవద్దన్నారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమని తల్లితండ్రులు పిల్లలను చదివించాలని సూచించారు. గ్రామంలో నిషేధిత గంజాయి సాగు చేయవద్దన్నారు. అటవీ జంతువులను వేటాడటం, వాటి వేట కోసం విద్యుత్ తీగలను అమర్చటం చట్ట రీత్యా నేరమన్నారు.



మహిళ సిబ్బంది విశ్రాంతి గది ప్రారంభం

మండల పోలీస్ స్టేషన్ ఆవరణలో మహిళా పోలీస్ సిబ్బంది విశ్రాంతి కోసం నిర్మించిన రెస్టు రూమ్‌ను జిల్లా ఎస్పీ ప్రారంభించారు. విరామ సమయాల్లో మహిళ సిబ్బంది విశ్రాంతి కోసం ఈ రెస్ట్ రూమ్ ఉపయోగపడుతుందని ఎస్పీ అన్నారు. ఈ రెస్ట్ రూమ్ నిర్మాణానికి కృషి చేసిన కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు, దహెగాం ఎస్సై సనత్‌లను అభినందించారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, సరిత పాల్గొన్నారు.

యువతకు అనుకూలంగా గ్రంథాలయాల అభివృద్ధి

- జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

యువత ఆలోచనలకు అనుగుణంగా గ్రంథాలయాల అభివృద్ధి చేయడం జరుగుతుందని దీని ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలకు నిర్వహించే పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే నిరుద్యోగ యువతకు మరిన్ని అవకాశాలు కల్పించేలా ఏర్పాట్లు చేస్తామని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. గురువారం జిల్లా గ్రంథాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠకులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు అవసరమైన అన్ని పుస్తకాలను గ్రంథాలయాలలో అందుబాటులో ఉంచామన్నారు. ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకొని అభ్యర్థులు పోటీ పరీక్షలకు సిద్ధమై ప్రభుత్వ కొలువులు సాధించి తల్లిదండ్రులకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కేవీపీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేవీపీఎస్ క్యాలెండర్‌ను ఎస్సై సాగర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ నాయకులు సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను ఎస్సై వివరించారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా నాయకులు దుర్గం దినకర్, కార్తీక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన సంఘటన జిల్లా కేంద్రంలోని పొట్టి శ్రీరాములు చౌక్ సమీపంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే పాత అశోక్ ఇంట్లో మొదటి అంతస్తులో అద్దెకు గోల్డ్ స్మిత్ సత్యనారాయణ ఉంటున్నారు. ప్రతిరోజు లాగే వాటాలో మొదటి రూమ్‌లో నిద్రిస్తుండగా, ఉదయం నాలుగు గంటల ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఒకసారి నిలిచిపోయి మళ్ళీ వచ్చింది. రోజులాగే ఉదయం లేచి చూడగానే వంట రూమ్‌లో పెద్ద మొత్తంలో పొగా ఉండడాన్ని గుర్తించి వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సిబ్బంది వచ్చేవరకు నష్టం జరిగినట్టు వివరించారు. దీనిలో 20 గ్రాముల బంగారం, ఒక కిలో వెండి రూ. మూడు లక్షలతో పాటు, బీరువా, ఫ్రిడ్జ్ కాలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.7 లక్షల వరకు నష్టం వాటిల్లిందని తనను ఆదుకోవాలని కోరారు. రెవెన్యూ సిబ్బంది వచ్చి పంచనామ చేశారు.

గ్రామ పంచాయతీ నూతన భవనం ప్రారంభం



నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని జైత్‌పూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే కోవ లక్ష్మి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో గ్రామ పంచాయతీ కార్యాలయాలు లేక పరిపాలన అద్దె గదిలో నిర్వహించడంతో ఇబ్బందులకు గురయ్యేవారని తెలిపారు. ప్రస్తుతం ప్రజలకు అందుబాటులో ఉండడం కోసం అన్ని సదుపాయాలతో నూతన గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు ముండె విమలాబాయి, జెడ్పీటీసీ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అజయ్‌కుమార్, సర్పంచ్ గుర్నులే రేణుక, సింగిల్ విండో చైర్మెన్ జాబిరె పెంటు, ఉప సర్పంచ్ మోర్లె తిరుపతి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



నవతెలంగాణ-సిర్పూర్(టి)

ప్రభుత్వం పేద ప్రజలకు ఉచితంగా అందజేస్తున్న రేషన్‌బియ్యం అక్రమంగా రవాణ చేసిన, విక్రయించిన కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు శ్రీనివాస్, శ్యాంలాల్ అన్నారు. గురువారం మహారాష్ట్రకు అక్రమంగా రేషన్‌బియ్యాన్ని తరలిస్తున్నారనే సమాచారం మేరకు వెంకట్రావ్‌పేట్ క్రాస్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా గురువారం రేషన్ బియ్యం పట్టుకున్నారు. మహారాష్ట్రకు గుంగ్లె రాజ్‌కుమార్, రోహిని లక్ష్మణ్ అనే వ్యక్తులు ఎనిమిది ప్లాస్టిక్ సంచుల్లో ఐదు క్వింటాళ్ల 10 కిలోల పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నామని డీటీలు తెలిపారు. పట్టుబడిన బియ్యాన్ని రేషన్ దుకాణానికి అప్పగించి వారిపై కేసు నమోదు చేశామన్నారు. ప్రభుత్వం పంపిణీ చేసే బియ్యాన్ని ఏ ఒక్కరు కూడా అమ్మకూడదని, అమ్మడానికి ప్రోత్సహించిన, తరలించిన వారిపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గణతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో నిర్వహించే గణతంత్ర దినోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఎంపీడీఓ శివకుమార్ తెలిపారు. ఉదయం జెండా వందన కార్యక్రమానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-మందమర్రి



ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కుంచాల ఆంజనేయులు కుటుంబానికి భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యులు రూ.20,000 ఆర్థిక సాయాన్ని మృతుని కుటుంబానికి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం పట్టణ అధ్యక్షుడు దుర్గయ్య మాట్లాడతూ తమ సంఘంలో కోశాధికారిగా పనిచేసిన ఆంజనేయులు మృతి భాధకరమని అన్నారు. ఆంజనేయులు కుటుంబానికి భవన నిర్మాణ కార్మిక సంఘం ఎల్లప్పుడు అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ధర్మయ్య, చంద్రయ్య, లింగయ్య, మొగిలి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ధర్మారావుపేట కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని ధర్మరావు పేట్ గ్రామంలో కాంగ్రెస్ కమిటీ కాసిపేట మండల అధ్యక్షుడు వేముల కృష్ణ అధ్యక్షతన ఎంపీటీసీ పార్వతి మల్లేష్ ఆధ్వర్యంలో ధర్మారావు పేట్ కాంగ్రెస్ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా గోపు శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా చొప్పదండి గట్టయ్య, గుమ్ముల నరేష్, ప్రధాన కార్యదర్శిగా కొప్పుల శంకరయ్య ప్రచార కార్యదర్శి బాణాల చారిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి జంగిలి రమేష్ యాదవ్, చెన్నవేని చంద్రయ్య, నేరేళ్ల రవి, తన్నీరు మహేష్, ఎర్రోజుల శంకరయ్య, అల్లముల నాగయ్య, మామిడాల ప్రసాద్, ముత్యాల కుమార్, బరిగెల కిరణ్, తోటపెల్లి రామయ్య, నాగయ్య పాల్గొన్నారు.

'ప్రభుత్వాన్ని శాసించే శక్తి ఓటుకు ఉంది'



నవతెలంగాణ-జన్నారం

సమాజం స్థితిగతులను మార్చే శక్తి ఒక్క ఓటుకు మాత్రమే ఉందని తహసీల్దార్ వేణుగోపాల్ అన్నారు. 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం నుంచి ప్రధాన రహదారి వెంట వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి ర్యాలీగా వెళ్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క పౌరుడు ఓటు హక్కును వినియోగించుకోవాలని 18 ఏండ్లు నిండిన యువతీ యువకులు ఓటర్‌గా నమోదు చేసుకోవాలని సూచించారు. ఒక్క ఓటు తరతరాల గతిని మార్చే అస్త్రం సామాన్యుడు చేతిలో వజ్రాయుధం లాంటిదని ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్యంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఓటు హక్కును వినియోగించుకుందాం ప్రజాస్వామ్యాన్ని రక్షించుకుందాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ విజయకుమార్, ఆర్ఐ భానుచందర్, డిప్యూటీ తహసీల్దార్ రామ్మోహన్, బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొండు జనార్ధన్ పాల్గొన్నారు.

మందమర్రి : జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా కళాశాల విద్యార్థులు ఓటర్ల అవగాహన ర్యాలీ నిర్వహించారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం అవగాహనా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తహసీల్దార్ చంద్రశేఖర్ హాజరయ్యారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మునిగంటి కృష్ణయ్య, ఆర్ఐ పద్మజ, ఎన్ఎస్-ఎస్ ప్రోగ్రాం ఇన్‌ఛార్జీ మంతెన రామయ్య పాల్గొన్నారు.



మందమర్రి లో..

లక్షెట్టిపేట : ప్రతి ఒకరికి ఓటు హక్కు అవసరమని మంచిర్యాల ఆర్డీఓ రాములు అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ర్యాలీలో ప్రభుత్వ బాలుర బాలికల ఉన్నత పాఠశాల, ఆశ్రమ పాఠశాల మరియు గుడ్ షెఫర్డ్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.. గ్రౌండ్ నుండి ర్యాలీగా బయలుదేరి ఉత్కూర్ చౌరస్తా వరకు విద్యార్థులు, పట్టణ ప్రజలు అందరూ కలిసి ర్యాలీగా వచ్చి ఉత్కూర్ చౌరస్తాలో మానవ హారం నిర్వహించారు. వీరిచే మంచిర్యాల నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి మరియు రాజస్వ మండల అధికారి వాడల రాములు ఓటర్ల తొ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన లక్షెట్టిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో నిన్న నిర్వహించిన వ్యాస రచన, స్పీచ్,



కాసిపేటలో..

పోస్టర్ ప్రసెంటేషన్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వాడల రాములు, తహసీల్దార్ రాఘవేంద్రరావు, ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్, కళాశాల ప్రిన్సిపల్ ఓజా, హజీపూర్ తహశీల్దార్ సతీష్ కుమార్, దండేపల్లి తహసీల్దార్ సంధ్య రాణి పాల్గొన్నారు.

వేమనపల్లి : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ సదానందం, ఎంపీడీఓ అల్లూరి లక్ష్మయ్య, ఎంపీఓ శ్రీపతిబాపురావు, నాయబ్ తహసీల్దార్ గోవింద్ నాయక్ ఆధ్వర్యంలో ఓటరు నమోదుపై అవగాహణ కలిపిస్తూ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి బస్టాండ్ ప్రాంతంలో మానవహారం నిర్వహించారు.

జైపూర్ : భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ప్రజాస్వామ్య వ్యవస్థకు ఊపిరి అందిస్తుందని భీమారం మండల తహసీల్దార్ విశ్వంబర్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో కలిసి గురువారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీడీఓ



వేమనపల్లిలో..

శ్రీనివాస్ రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు విక్రమ్ కుమార్, స్థానిక సర్పంచ్ గద్దె రాంరెడ్డి పాల్గొన్నారు. జైపూర్ మండల తహసీల్దార్ రమేష్, ఎంపీడీఓ సత్యనారాయణ తహసీల్దార్ కార్యాలయంతో పాటు మండల పరిషత్ కార్యాలయంలో ఓటు హక్కును సధ్వినియోగం చేసుకుందామని సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు.

తాండూర్ : ఓటరు దినోత్సవం సందర్భంగా తాండూర్ ఐబి కేంద్రంలో పంచాయతీరాజ్ వైద్య విద్య పీసీసీ సంక్షేమం ఐకేపీ పోలీస్ అధికారులు సిబ్బందితో తహసీల్దార్ రోహిత్ ర్యాలీ నిర్వహించారు. మాదారం పాఠశాలలో హెచ్ఎం శ్రీలక్ష్మి విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ మురళీధర్‌రావు, సుమన, చైతన్య, ఎంఈఓ ప్రభాకర్, హెచ్ఎం మల్లేశం, ఏపీఓ పుమా నాయక్, నందకుమార్ పాల్గొన్నారు.

కాసిపేట : మండల కేంద్రంలో గురువారం ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులతో కలిసి ఆయా గ్రామాల్లో అధికారులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేపట్టారు. ఈ సంధర్భంగా ఓటు ప్రాముఖ్యతపై అధికారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భోజన్న ఎంపీడీఓ ఎంఏ అలీం, ఎంఆర్ఐ సులోచన పాల్గొన్నారు.



లక్షెట్టిపేటలో..

జిల్లాలో నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి



నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి అన్నారు. గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య, మండల విద్యాధికారి పోచయ్యకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలలో నాణ్యమైన భోజనం పెట్టకపోవడం వలన విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, అంతేకాకుండా విద్యార్థులు వారి ఇంటి నుంచి టిఫిన్ బాక్స్ తీసుకు వస్తున్నారని అన్నారు. గతంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ నాయకులు సర్వేలో భాగంగా ఈ సమస్యలు వెలుగులోకి వచ్చాయని, కాబట్టి నాణ్యమైన భోజనం అందించాలని, కొత్త బియ్యం సరఫరా చేయాలని మంచిర్యాల జిల్లా కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఈదునూరి అభినవ్, రాంచరణ్ పాల్గొన్నారు.

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-నస్పూర్

టీఎస్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) క్యాలెండర్ను మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్, టీస్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు చిందం వెంకటేష్, యూనియన్ నాయకులు అంజి, పోషం, మహేందర్ పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థికి కలెక్టర్ ప్రశంస



నవతెలంగాణ-జన్నారం

జాతీయ ఓటరు దినోత్సవం సదర్భంగా జిల్లా స్థాయిలో 18 మండలాల విద్యార్థులతో నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో మండలంలోని కిష్టాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థి గెడం సందేశ్ (9వ తరగతి) ప్రథమ స్థానంలో నిలవడంతో కలెక్టర్, బదావత్ సంతోష్ , అదనపు కలెక్టర్, రాహుల్, డీఆర్డీఓ శేషాద్రి, డీఈఓ యాదయ్య చేతుల మీదుగా షీల్డ్ ప్రశంస పత్రం అందుకున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజన్న తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జాతీయ ఓటరు దినోత్సవంను పురస్కరించుకొని విద్యార్థికి భహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుండ రాజన్న, ఉపాధ్యాయులు దాముక కమలాకర్, జాడి మురళి, గోవర్ధనాచారి పాల్గొన్నారు.

కోదండరాంకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వడం హర్షనీయం

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని సోమగూడెం గ్రామంలో జన సమితి ఆధ్వర్యంలో ప్రొఫెసర్ కోదండరాంకు ఎమ్మెల్సీగా నియామించిన సందర్భంగా సంబరాలు నిర్వహించారు. బాణా సంచా పేల్చి స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా జన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి గోనెల శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. రాహుల్ గాంధీ, సోనియా గాంధీలకు కృతజ్ఞతలు తెలిపారు. వరంగల్ డిక్లరేషన్ సభలో తెలంగాణ జన సమితికి కాంగ్రెస్‌కు మద్దతు తెలిపితే ప్రాధాన్యత ఇస్తామని రాహుల్ ఇచ్చిన మాట ప్రకారంగా సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్సీగా ప్రకటించడం హర్షనీయం అన్నారు.

కేతేశ్వర కంకాలమ్మ జాతర పోస్టర్ల ఆవిష్కరణ



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని పొన్కల్ గ్రామపంచాయతీ పరిధిలోని వీర్లగుట్టపై వెలసిన శ్రీకేతేశ్వర స్వామి కంకాలమ్మ జాతర పోస్టర్లను గురువారం తహసీల్దార్ వేణుగోపాల్ ఆవిష్కరించారు. కేతేశ్వర స్వామి కంకాలమ్మ జాతర ఈ నెల 28న ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు ఎంఆర్ నరసింహారావు, చిలువేరు నరసయ్యలు తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని తహసీల్దార్ నిర్వాహకులకు సూచించారు.

ప్రాణహిత నది పరిసర ప్రాంతాల్లో డ్రోన్ నిఘా

నవతెలంగాణ-వేమనపల్లి

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరంచుకొని మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యగా ప్రాణహిత నది పరిసర ప్రాంతాల్లో గురువారం సాయంత్రం రూరల్ సీఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో పోలీసులు డ్రోన్ కెమెరాతో నిఘా ఏర్పాటు చేశారు. తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దున ప్రవహిస్తున్న ప్రాణహిత నది తీర ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. మహారాష్ట్ర నుంచి పడవల ద్వారా నది దాటి వేమనపల్లికి వచ్చే వ్యక్తులను తనిఖీలు చేస్తూ వివరాలు సేకరించారు. నది పరిసర ప్రాంతాల్లో అపరిచిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అసంఘీక కార్యకలాపాలకు పాల్పడున్న వారి సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. శాంతి భద్రతలకు విగాతం కల్గించే వ్యక్తు ఎవరైనా సరే ఉపోక్షించేది లేదని హెచ్చరించారు. ప్రజలకు ఎల్ల వేలలా అందుబాటులో ఉంటూ పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణకు పాటు పడుతారని, అందులో భాగంగానే డ్రోన్‌తో సరిహద్దులో నిఘా పెట్టామన్నారు.

బూత్ లెవల్ కన్వీనర్ల శిక్షణ కార్యక్రమానికి హాజరైన నాయకులు

నవతెలంగాణ-లక్షెట్టిపేట

బూత్ లేవన్ కన్వీనర్ల శిక్షణ శిబిరానికి లక్షెట్టిపేట మండల, పట్టణ కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు. గురువారం ఆల్ ఇండియా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే హైదరాబాద్ వస్తున్న సందర్భంగా ఎల్బీ స్టేడియంవద్ద నిర్వహిస్తున్న కాంగ్రెస్ రాష్ట్ర స్థాయి బూత్ లెవెల్ ఏజెంట్స్ మీటింగ్‌కు కాంగ్రెస్ మండల నాయకులు, పట్టణ బూత్ లెవెల్ ఏజెంట్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పార్లమెంటు ఎన్నికల్లో విజయం లక్ష్యంగా చేసుకుని బూత్ లెవెల్ కన్వీనర్‌ల శిక్షణ శి బి ంా ని ౖ ఏ ంా ు ట ం చేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శుక్రవారం | జనవరి 26, 2024 | www.navatelangana.com

పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



పారిశుద్ధ కార్మికులను పర్మినెంట్ చేయాలని టీఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి సారంగపాణి అన్నారు. గురువారం పట్టణంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కరోనా సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి సేవ చేసిన పారిశుద్ధ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. జీఓ నెంబర్ 51నీ రద్దు చేసి గ్రామపంచాయతీలో పనిచేస్తున్న మల్టీపర్పస్ వర్కర్లను రెగ్యులర్ చేయాలన్నారు. టీఎమ్మార్పీఎస్ బలోపేతానికి నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు అంబాల రవి, నాయకులు నరేష్, రాజు సమ్మయ్య లక్ష్మణ్ పాల్గొన్నారు.

దేశ భవిష్యత్తు యువత చేతిలోనే : ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దేశ భవిష్యత్తు యువత చేతిలోనే ఉందని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువత తమ పేర్లను ఓటరుగా నమోదు చేసుకోవాలని ఎమ్మెల్యే పాయల శంకర్ కోరారు. గురువారం బీజేవైఎం ఆధ్వర్యంలో నమో నవధాత సమ్మేళనంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నూతన ఓటర్లతో లైవ్‌లో మాట్లాడారు. విద్యార్థి కళాశాలలో పెద్ద స్క్రీన్ ఏర్పాటు చేసి మోదీ సందేశాన్ని విద్యార్థులు తిలకించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి, బీజేపీ నాయకులు లాలామున్న, వేదవ్యాస్, జోగు రవి పాల్గొన్నారు.



కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో గురువారం కందుల కొనుగోలు కేంద్రాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రారంభించారు. ముందుగా కాంటాకు పూజలు చేసి తొలి రైతును సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు ఇబ్బందులు కలుగకుండా కేంద్రాలు ఏర్పాటు చేసి కందులను కొనుగోళు చేస్తుందన్నారు. రైతులు పండించిన ప్రతి పంట మార్కెట్ యార్డుకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సంధ్యారాణి, మార్కెట్ కమిటీ చైర్మెన్ రుక్మాన్ సింగ్, సర్పంచ్ సురేందర్ యాదవ్, పీఏసీఎస్ చైర్మెన్ కదం ప్రశాంత్, మార్కెట్ కార్యదర్శి దేవయ్య పాల్గొన్నారు.

టీఎస్ మెసా క్యాలెండర్ విడుదల



నవతెలంగాణ-లక్షెట్టిపేట

తెలంగాణ స్టేట్ మైనారిటీ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ 2024 సంవత్సరం లక్షెట్టిపేట డివిజన్ కమిటీ నూతన క్యాలెండర్‌ను గురువారం స్థానిక తహసీల్దార్ రాఘవేంద్ర రావు, మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ చేతులమీదుగా అవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా టీఎస్ మెసా అధ్యక్షులు ముతియుల్లా ఖాన్, లక్షెట్టిపేట డివిజన్ గౌరవ అధ్యక్షులు యం.డి.సర్వర్ , అడ్వైజర్ ఫక్రుద్దీన్, ప్రధాన కార్యదర్శి యం.డి.జావిద్ , ట్రెజరర్ ఎజాజ్ , ఉపాధ్యక్షులు రషీద్ ఖాన్ , మరియు ఉర్దూ మీడియం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురు స్వామి రంగాచారికి ఘన నివాళులు

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

అయ్యప్ప భక్తుడు, సింగరేణి సివిల్ డిపార్ట్మెంట్ కార్మికుడు గురు స్వామి రంగాచారి బుధవారం గుండె నొప్పితో అకాల మరణం చెందారు. విషయం తెలుసుకున్న పట్టణ ప్రజలు, నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చి గురువారం ఆయన పార్థివ దేహానికి ఘన నివాళ్లు అర్పించి, అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఆయన మరణంతో కుటుంబ సభ్యులలో, పట్టణంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఆయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు.

బాధితుడిని పరామర్శించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని సుంకిడి గ్రామానికి చెందిన మహేందర్ యాదవ్ గత కొద్దిరోజుల క్రితం గుండెపోటుకు గురి కాగా గురువారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బాధితుడి కుటుంబాన్ని పరామర్శించారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని కోరారు. ఎమ్మెల్యే వెంట భీంపూర్ జెడ్పీటీసీ సుధాకర్, గ్రామ సర్పంచ్ మహేందర్ యాదవ్, మండల కన్వీనర్ తోట వెంకటేష్, బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి కిరణ్ కుమార్, అపార్టీ నాయకులు ఆశన్న యాదవ్, రవికాంత్, వెంకన్న, సునీత అభిరామ్‌రెడ్డి, కార్యకర్తలు, నాయకులు ఉన్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కృషి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయల శంకర్ పేర్కొన్నారు. స్థానిక కిసాన్‌చౌక్ వద్ద వ్యాపారస్తులు, ప్రజలు ట్రాఫిక్ వల్ల పడుతున్న ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని గురువారం కిసాన్‌చౌక్ పరిసరాలను మున్సిపల్, ఆర్‌అండ్.బి, ట్రాఫిక్ అధికారులతో కలిసి పరిశీలించారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై ఆయన చర్చించారు. ఆర్‌ఓబి పనుల అనంతరం రోడ్డును వెడల్పు చేసేలా, అదేవిధంగా ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేస్తే ట్రాఫిక్ సమస్యను పరిష్కారానికి తోడ్పడుతుందని తెలిపారు. అదేవిధంగా మున్సిపల్, మార్కెట్, ఆర్ అండ్ బి శాఖలతో త్వరలో సమావేశం నిర్వహించి ట్రాఫిక్ సమస్యను నియంత్రించడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ ప్రణయ్, ఆర్ అండ్ బి సిబ్బంది, ట్రఫిక్ సిబ్బంది, కౌన్సిలర్‌లు, బీజేపీ నాయకులు ఉన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు విలువ అపారం

- ఘనంగా ఓటర్ల దినోత్సవ వేడుకలు
- పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ



ఆదిలాబాద్‌లో..

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ప్రజాస్వామ్యంలో ఓటు శక్తివంతమైన సాధనమని, దీని విలువ అపారమని, రాజ్యాంగం పౌరులకు ఇచ్చిన అమూల్యమైన హక్కు అని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. 14వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ గౌస్ ఆలంతో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి సంవత్సరం జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించుకోవడం జరుగుతున్నదన్నారు. ఓటర్ల దినోత్సవం సందర్భంగా తీసుకొస్తున్న మార్పులు, సంస్కరణలు, ఓటు హక్కు, దాని ప్రాధాన్యత అంశాలపై వివిధ రకాల అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా రంగోలి పోటీలు, నూతన ఓటర్లకు గుర్తింపు కార్డుల పంపిణీ, సీనియర్ సిటిజన్లకు సన్మానం, పాఠశాలలు, కళాశాల స్థాయిలోని పిల్లలకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు వంటి కార్యక్రమాలను నిర్వహించి అవగాహన కల్పించామన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వద్దులకు, దివ్యాంగ ఓటర్లకు ఇంటి దగ్గరికి వెళ్లి ఓటు వేసే విధంగా అవకాశం కల్పించడం జరిగిందని వివరించారు. అనంతరం ఓటు హక్కుపై కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాజాత, విద్యార్థులు ఓటు ప్రాధాన్యతపై అవగాహన ప్రదర్శనలు ఆహ్వానితులను అలరించాయి. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్లను శాలువాతో సన్మానించారు. ఓటరు అవగాహనపై నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను పంపిణీ చేశారు.

బైక్ ర్యాలీ నిర్వహించి..ఓటు అవగాహన కల్పించి

అంతకు ముందు స్థానిక ఇందిరా ప్రియదర్శిని క్రీడా మైదానంలో ఓటు హక్కు వినియోగం, నమోదుపై నిర్వహించిన బైక్ ర్యాలీని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి జెండా ఊపి ప్రారంభించారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుండి కలెక్టర్ చౌక్, తెలంగాణ చౌక్, వినాయక్ చౌక్, నేతాజీ చౌక్, పంజాబ్ చౌక్ మీదుగా జడ్పీ కార్యాలయ సమావేశ మందిరం వరకు సాగిన బైక్ ర్యాలీలో కలెక్టర్, ఎస్పీ, అటవీ అధికారి, పోలీస్, ఎన్సీసీ, వివిధ వర్గాల ప్రజలు, అధికారులు, యువత పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్, డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు, డీపీఆర్ఓ ఇ.విష్ణువర్ధన్, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలంద ప్రియా, జిల్లా అధికారులు, పాఠశాలలు, కళాశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉట్నూర్ : అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, ప్రిన్సిపాల్ పావని కుమారి అన్నారు. గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉట్నూర్‌లో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయం నుంచి ఐబీ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఆర్డీఓ జీవాకర్‌రెడ్డి మాట్లాడుతూ 18 ఏండ్లు నిండిన యువతీ, యువకులు ఓటు హక్కు పొందే అధికారం రాజ్యాంగం కల్పించిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మనోహర్, అధ్యాపకులు శ్రీనివాసరావు, సువర్ణ, వినోద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ లక్ష్మణ్, తిరుపతి, సుజాత, సవీన్, దశరథ్, కిషోర్, రూప, ప్రకాష్, సాయికృష్ణ, అజీజ్‌ఖాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రూరల్ : అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని బూత్ లెవల్ అధికారి కొత్తపెల్లి రమేష్ అన్నారు. గురువారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని, మండలంలోని వాఘాపూర్, కచ్‌కంటి గ్రామాల్లోని పాఠశాల విద్యార్థులచే ర్యాలీని నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు నమోదుతో పాటు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు గౌతమి, కిషోర్, స్వర్ణలత, గ్రామకార్యదర్శి వసీం, యువకులు సీహెచ్ రవి, కె.గొవింద్, కె.చిన్న, బీమన్న రాజేశ్వర్, రాజు పాల్గొన్నారు.

సిరికొండ : రాజ్యాంగం ప్రజల చేతిలో వజ్రాయుధంలా ఓటు హక్కు పని చేస్తుందని తహసీల్దార్ విజయ్ కుమార్ అన్నారు. గురువారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్, సర్పంచ్ నర్మద పెంటన్న పాల్గొన్నారు.



ఇచ్చోడలో..

నార్నూర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురువారం జాతీయ ఓటర్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.బాలాజీ, అధ్యాపకులు కే.వెంకటరమణ, పి.ఉదయ్ కుమార్, సుజాత, దోమకొండ సుజాత, చదల నరేష్, చాలూర్కర్ పుష్ప, అశ్రఫ్,

ఆర్.వైష్ణవి, హెచ్.జలంధర్, బి.శివ ప్రసాద్, పి.గజానంద్, ఆడే. కృష్ణవేణి, సీహెచ్ రుక్మిణి పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌లో..

బజార్‌హత్నూర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ ఓటర్ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించడంతో పాటు ఎన్నికలలో నిష్పక్షపాతంగా ఓటు హక్కును నిర్భయంగా ఉపయోగించుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ సూచించారు. ఈ సందర్భంగా కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి జ్ఞానేశ్వర్ షిండే విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు గంగాధర్, భీమేష్, నవీన్ రెడ్డి, అశోక్ రెడ్డి, శ్రీనివాస్, వనజ, ప్రదీప్, సుభాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇచ్చోడ : మండల కేంద్రంలో గురువారం 14వ జాతీయ ఓటరు దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాల నుండి ప్రధాన వీధుల గుండా విద్యార్థులు, విద్యార్థినీలు ప్లకార్డులు చేతబట్టి నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ జాదవ్ రామారావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు విలువైనదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ చౌహాన్ సునీత, ఎంఈఓ ఉదయ్ రావు, ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

బోథ్ : మండల కేంద్రంలోని 14వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని తహసీల్దార్ కార్యాలయం నుండి పట్టణంలోని వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సమీపంలో ఓటరు ప్రతిజ్ఞ చేశారు. సీనియర్ సిటిజెన్లు, యువ ఓటర్లు, ఉత్తమ బీఎల్ఓలను తహసీల్దార్, ఎస్సై, ఎంపీడీఓలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుభాష్ చందర్, ఎంపీడీఓ సుశీల్ రెడ్డి, ఎస్సై రాము, అధికారులు, విద్యార్థులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ సేవా పథకం అధ్వర్యంలో

18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోని ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిందర్ అన్నారు. గురువారం జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని వాగ్దేవి జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటు ప్రాముఖ్యతను ఓటర్లుకు తెలియజేశారు. రానున్న ఇంటర్ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు కష్టపడి చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాంటెండ్ రాజశేఖర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ప్రవీణ్ రెడ్డి, కార్తీక్, దీప, ముత్యం, సతీష్, నరేష్, నవీన్, ప్రసాద్, రాజేశ్వర్, స్వామి, మహేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బోథ్‌లో..



బజార్‌హత్నూర్‌లో..

ఓటు హక్కును డబ్బు, మద్యానికి అమ్ముకోవద్దు

- డా.ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్
- గంగాపూర్‌లో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్‌పీ

నవతెలంగాణ-చింతలమానేపల్లి

డా. బీఆర్.అంబేడ్కర్ రాజ్యాంగంలో కల్పించిన ఓటు హక్కును డబ్బు, మద్యానికి అమ్ముకోవద్దని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ సూచించారు. గురువారం మండలంలోని గంగాపూర్ గ్రామం లో భారత రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు అత్యంత విలువైనదని, దాని ద్వారానే బహుజనులకు రాజ్యాధికారం సాధ్యమన్నారు. ఓటు హక్కును అభివృద్ధి చేసే నాయకులను ఎన్నుకోవడానికి మాత్రమే వాడాలని, మద్యానికి బానిసై అమ్ముకోవద్దని సూచించారు. కానీ దురదృష్టంకొద్దీ ఎన్నికల్లో ఓటును అమ్ముకునే దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. మహానీయుల విగ్రహాలతోనే అగిపోవద్దని, వారి ఆలోచనలను కూడా అచరణలో పెట్టాలన్నారు. విద్య ద్వారానే బహుజనుల బతుకులు మారుతాయని అన్నారు. దేశంలో ఆధిపత్య పాలకులు రాజ్యాంగం అమలు చేయకుండా 125 అడుగుల విగ్రహం పెడుతున్నారు కానీ, సంపద సృష్టించే మార్గం మాత్రం చూపించడంలేదని ధ్వజమెత్తారు. 75 ఏండ్లుగా దేశాన్ని పాలిస్తున్న ఆధిపత్య పాలకులు అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం అమలు చేయకుండా, రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. అటువంటి నియంత పాలకులు రాజ్యాంగ నిర్మాత విగ్రహాన్ని కూడా తాకే అర్హత లేదని హెచ్చరించారు. దేశంలో అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా సామాజిక న్యాయం కోసం ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతున్న ఏకైక పార్టీ బీఎస్పీనే అన్నారు. అనంతరం బౌద్ధ బిక్కు బాధంత్ బుద్ధ శరణ్ తేరో వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి, నాయకులు దుర్గం మోతీరామ్, బండు పటేల్, విజయ నిర్మల, సర్పంచ్ గోమాస విలాస్, జనార్దన్, దుప్త సూరన్న, రాజేష్, శేఖర్, సాగర్, మాజీ జెడ్పీటీసీ దుబ్బుల వెంకన్న, చప్లె సుధాకర్ పాల్గొన్నారు.



విగ్రహావిష్కరణలో పాల్గొన్న జనాలు

గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం

- జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమని ఆసిఫాబాద్ జెడ్పీటీసీ అరిగేల నాగేశ్వరరావు అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ మల్లికార్జున్, ఎంపీడీవో శశికళల అధ్యక్షతన ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి సర్పంచులు, స్థానిక అధికారుల సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. ఐదేళ్ల పాలనలో మండలంలోని పలు గ్రామపంచాయతీల సర్పంచులు సమస్యలను పరిష్కరించడంలో ముందు వరుసలో ఉన్నారని కొనియాడారు. 2020 సంవత్సరంలో కరోనా మహమ్మారి తీవ్రరూపం దాల్చినప్పుడు ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సర్పంచులు కష్టపడ్డారని గుర్తు చేశారు. ఈ నెలతో సర్పంచుల పదవీ కాలం ముగియడంతో వారికి సన్మానం చేసి షీల్డ్‌లు అందజేశారు. సర్పంచుల పదవీకాలం పూర్తి అయినప్పటికీ వారు నిత్యం ప్రజల్లో ఉంటూ సమస్యలను తెలుసుకొని అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించేలా చూడాలన్నారు. అంతకు ముందు పలు శాఖలకు చెందిన సమస్యలను ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని నీటి సమస్య, కరెంటు కోతలు లేకుండా చూడాలని, గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ రమేష్, సింగిల్ విండో చైర్మెన్ అలీబిన్ అహ్మద్, ఎంపీఓ ప్రసాద్, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

హైదరాబాద్ బయల్దేరిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-ఉట్నూర్

హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ఏఐసీసీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ కార్గె సమావేశానికి మండల పార్టీ శ్రేణులు తరలివేళ్లారు. గురువారం జరిగిన సమావేశంలో పార్లమెంట్ ఎన్నికలపై జాతీయ అధ్యక్షుడు దిశానిర్దేశం చేశారు. దీనికి ఉట్నూర్, ఇంద్రవెల్లి మండల పార్టీ జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు తరలివేళ్లారు.